నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 20, ఫిబ్రవరి 2026 పేజీలు:4

# వనపర్తి పుర పట్టాభిషేకానికి వేలాయే!

- హాజరుకానున్న ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, డిసిసి అధ్యక్షులు శివసేనారెడ్డి
- 5వేల మందితో భారీ ర్యాలీకి ఏర్పాట్లు పూర్తి
- ఫ్లెక్సీల ఏర్పాటుతో ఎటు చూసినా కోలాహలంగా కనిపిస్తున్న పట్టణ రహదారులు
- ర్యాలీకి వచ్చిన వారికి క్యాంపు కార్యాలయంలో భోజన వసతులు ఏర్పాటు

వనపర్తి ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్/జి.శ్రీనివాస యాదవ్ జగత్‌పల్లి)-ఫిబ్రవరి 19:

**వనపర్తి పుర పట్టాభిషేకానికి నేడు వేళయింది.** మునిసిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా రెపరెపలాడనుంది. మునిసిపాలిటీలో 33 వార్డులు ఉండగా ఇద్దరు కాంగ్రెస్ అనుబంధ మద్దతుదారులతో కలిపి 22 స్థానాలు కైవసం చేసుకోవడంతో ఈనెల 16న ప్రమాణ స్వీకారం పూర్తిచేసుకుని ప్రజా పాలనకు వడివడిగా అడుగులు వేసేందుకు మునిసిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌లు అడుగులు వేస్తున్నారు. పుర పట్టాభిషేకానికి ముఖ్య అతిథులుగా మిగతా 2లో..






# తుప్పుపడుతున్న వైకుంఠ రథం..



- పట్టించుకోని పాలకులు!
- గ్రామస్తుల కష్టాలు.. ప్రజాధనం బూడిదలో పోసినపన్నీరేనా?
- షెడ్డుకే పరిమితం పిచ్చిమొక్కల మధ్య వాహనం

(నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి/మచ్చ శ్రావణ్ రాయపర్తి)-ఫిబ్రవరి19:

**తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా** ప్రవేశపెట్టిన పల్లె ప్రగతి పనుల్లో భాగంగా గ్రామ గ్రామానికి వైకుంఠ రథాలను పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. కానీ రాయపర్తి గ్రామంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. వచ్చిన రోజు నుండి నేటి వరకు ఈ వాహనం ఒక్కసారి కూడా రోడ్డు ఎక్కలే లక్షలాది రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన ఈ ఫోర్స్ (Force) వాహనం, ప్రస్తుతం పిచ్చిమొక్కల



మధ్య, దుమ్ము పట్టి నిరుపయోగంగా పడి ఉంది. వాహనానికి టైర్లు పాడవుతున్నాయి, ఇంజిన్ మిగతా 2లో..

# వనపర్తి పుర పట్టాభిషేకానికి వేళాయె!








(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, సాట్స్ చైర్మన్, డీసీసీ అధ్యక్షులు శివసేనా రెడ్డి, వైశ్య కార్పోరేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వ సుజాత మరికొన్ని జిల్లాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రానున్నారు. వీరి రాకతో పాటు పుర పట్టాభిషేకాన్ని పురస్కరించుకొని నూతన చైర్ పర్సన్ మిడిదొడ్డి మాధవి భర్త ప్రముఖ వ్యాపారవేత్త ఎస్ఎల్ఎన్ రమేష్ వనపర్తిలో పై ముగ్గురి ఫోటోలతో కూడిన భారీ ఫ్లెక్సీలను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయడంతో ఎటు చూసినా పట్టణ రహదారులు కోలాహలంగా పండగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. ఉదయం 10:30 గంటలకు వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బాధ్యతలు చేపట్టి అక్కడినుండి ప్రధాన రహదారి గుండా 5వేల మందితో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు చేపట్టనున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి తరలివచ్చే కాంగ్రెస్ నాయకులు, అభిమానులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉంటే వనపర్తిలో టికెట్ల కేటాయింపు నుండి చైర్ పర్సన్ ఎన్నిక వరకు డిసిసి అధ్యక్షులుగా శివసేనారెడ్డి రాకతో చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి మధ్యలో సయోధ్య కుదిరి ముగ్గురు నాయకులు ఏకతాటిపైకి రావడంతో ప్రశాంతంగా కాంగ్రెస్ అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండడం క్యాబినెట్ హోదాలో చిన్నారెడ్డి, సాట్స్ చైర్మన్ హోదాలో శివసేనారెడ్డి, ఎమ్మెల్యే హోదాలో మేఘారెడ్డి ఇలా ముగ్గురి బలం చేకూర్చుకొని చైర్ పర్సన్ మాధవి వనపర్తి అభివృద్ధికి కొత్త పుంతలు తొక్కిస్తారని ప్రజలు భావిస్తున్నారు.

# తుప్పు పడుతున్న వైకుంఠ రథం

(మొదటి పేజీ తరువాయి)

మొరాయిస్తోంది. కనీసం దానికి రక్షణగా ఒక షెడ్డు కూడా లేకపోవడంతో ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పు పట్టిపోతోంది గ్రామంలో ఎవరైనా మరణిస్తే, శ్మశాన వాటికకు తీసుకెళ్లడానికి గ్రామస్తులు నేటికీ ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి ట్రాక్టర్లనో,ఆటోలనో అద్దెకు తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం ఉచితంగా వాహనం ఇచ్చినా, అధికారుల నిర్లక్ష్యం వల్ల అది ప్రజలకు ఉపయోగపడటం లేదు పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ (ప్రస్తుత ప్రత్యేక అధికారులు) ఈ విషయంపై తక్షణమే స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వాహనానికి అవసరమైన మరమ్మతులు చేయించి, డ్రైవర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు ఇప్పటికైనా ఈ విషయంపై తక్షణమే అధికారులు స్పందించి పక్కకు పడి ఉన్న వాహనాన్ని పరుగులు పెట్టించి గ్రామస్తుల అందరికీ అందుబాటు లో ఉండాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





# నేరాలను గుర్తించే శునకం మాయ రాక

**వనపర్తి ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-ఫిబ్రవరి 19:**

హైదరాబాద్ సమీపంలోని మొయినాబాద్ పోలీస్ డాగ్ ట్రైనింగ్ సెంటర్ లో అధునాతన శిక్షణ పొందిన శునకం మాయ గురువారం జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుంది. 8నెలల పాటు ప్రత్యేక శిక్షణ పొంది నేరస్తుల అడుగు జాడలను పసిగట్టడం, హత్య కేసులను ఛేదించడం, దొంగలను పట్టించడం వంటి వాటిలో అధునాతన శిక్షణ పొందిన మాయ ను డాగ్ హ్యాండ్లర్ దేవ్యా నాయక్ జిల్లా ఎస్పీ సునీత రెడ్డి ముందు ప్రవేశపెట్టారు. ట్రైనింగ్ సెంటర్ లో మా య పొందిన శిక్షణ పై ఎస్పీకి ఆయన వివరిం చారు. ప్రజల ప్రాణాలు



ఆస్తుల రక్షణనే పోలీసు శాఖ లక్ష్యంగా ముందుకు సాగాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, స్పెషల్ బ్రాంచ్ సిఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.


# కౌన్సిలర్ చుక్క సత్యంకు ఎమ్మెల్యే ఘన నివాళులు

**వనపర్తి ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-ఫిబ్రవరి 19:**

ఒకటవ వార్డుకు చెందిన కౌన్సిలర్ జయశ్రీ రాజు మామ చుక్క సత్యం కు ఎమ్మెల్యే మేఘారెడ్డి ఘనంగా నివాళులర్పించారు. మునిసిపల్ ఎన్నికల రోజున చుక్క సత్యం అకస్మాత్తుగా మృతి చెందడంతో గురువారం ఆయన దశదినకర్మను పట్టణంలోని రాయిగడ్డ వీధిలో గల వారి నివాసంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి, మున్సిపాలిటీ నూతన చైర్ పర్సన్ మిడిదొడ్డి మాధవి రమేష్ లు హాజరై ఆయన చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్ భర్త బ్రహ్మచారి, మాజీ వైస్ చైర్మన్ బి. కృష్ణ, కిచ్చారెడ్డి దేవన్న నాయుడు, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలి

- మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లను సత్కరించిన జర్నలిస్టులు
- టీయూడబ్ల్యూజే(ఐజేయు) జాతీయ కౌన్సిల్ సభ్యుడు దూలం శ్రీనివాస్

తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి

ఓరుగంటి సైదులు ఫిబ్రవరి 19:

మున్సిపాలిటీ అభివృద్ధికి నూతన పాలకులు కృషి చేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయు) జాతీయ కౌన్సిల్ సభ్యుడు దూలం శ్రీనివాస్ అన్నారు. గురువారం నూతనంగా ఎన్నికైన తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్ లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లకావత్ యాదగిరి నాయక్, జర్నలిస్టులు కొండం అశోక్ రెడ్డి, చౌడారపు రాము, చిలకమారి భాస్కర్, మెరుగు రమేష్ గౌడ్, చీకటి వీరన్న గౌడ్, నిమ్మల రవి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ

తొర్రూరు, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి/ఓరుగంటి సైదులు)-ఫిబ్రవరి 19:

తొర్రూరు పట్టణ కేంద్రంలో ఉన్న డిగ్రీ కళాశాలలో మార్చి 13న కామర్స్ డిపార్ట్మెంట్ వారిచే నిర్వహించే జాతీయ సదస్సుకు ఉన్నత విద్య కళాశాల జాయింట్ డైరెక్టర్లను అనుమతించారు. అనంతరం డైరెక్టర్లు రాజేందర్ సింగ్ బాల భాస్కరరావు ల చేతుల మీదుగా నేషనల్ సెమినార్ పోస్టర్లను



ఆవిష్కరించారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి జిడిసి తొర్రూరు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.రాములు,నేషనల్ సెమినార్ డైరెక్టర్ డాక్టర్ జి. సుజాత, నేషనల్ సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఆర్ సునీల్,డాక్టర్ బి కృష్ణవేణి కల్చరల్ కమిటీ కన్వీనర్ హాజరైనారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ బి. రాములు పోస్టర్ ఆవిష్కరణ అనుమతించి నేషనల్ సెమినార్ ను జరుపుకొనుటకు అంగీకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# గొల్ల కురుమలు అన్ని రంగాల్లో ముందుండాలి

- తొర్రూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ భూస అశోక్
- జిఎంపిఎస్ 2026 డైరీ ఆవిష్కరణ

తొర్రూరు, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి/ఓరుగంటి సైదులు)-ఫిబ్రవరి 19:

గొల్ల కురుమలు రాజకీయ ఆర్థిక రంగాలతో పాటు అన్ని రంగాలలో ముం దుండాలని తొర్రూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బూస అశోక్ ఆకాంక్షించారు. గురువారం గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం (జిఎంపిఎస్) 2026 డైరీ సంఘం జిల్లా నాయకులతో కలిసి గురువారం రోజు వారి కార్యాలయంలో తొర్రూరు ఎక్సైజ్ సీఐ బూస అశోక్ ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన





మాట్లాడుతూ ఈ జిఎంపిఎస్ డైరీ గొల్ల కురుమల ఐక్యతతో పాటు వారి అభివృద్ధికి, గొర్రెలు మేకల పెంపకం దారుల సమస్యల పరిష్కారం కోసం ఎంతో దోహదపడుతుందని అన్నారు. రాష్ట్రంలో దేశంలో యువత మొత్తం కూడా, మత్తుకు బానిసలు అవుతున్నారని, ప్రభుత్వం కొంత శ్రద్ధ వహించి యువకులు అందర్నీ అన్ని రంగాల్లో పోటీపడేలా శ్రద్ధ తీసుకోవా లని వారు సందర్భంగా కోరారు. యువ త విద్యా ఉద్యోగ రంగాల్లో ముందుం డాలఅన్నారు. రాష్ట్రంలో గొర్రెల మేకల పెంపకం వృత్తిని పెంచేలా కృషి చేయా లని, నిరుద్యోగ యువకులకు ఫామ్ సిస్టంలో గొర్రెల పెంపకాన్ని ప్రభుత్వ ప్రోత్సాహంతో ముందుకు తీసుకు వచ్చేలా, ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇచ్చేలా కృషి చేయాలని వారు అన్నారు. గొల్ల కురుమల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సంఘం గొర్రెలు మేకల పెంపకం దారుల సంగం అని వారు అన్నారు. గొల్ల కురుమ నిరుద్యోగ యువతి, యువకుల అభివృద్ధికి ఉపయోగపడేలా పోరాటాలను రూప కల్పన చేయాలని వారు సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పయ్యావుల మల్లయ్య, బొల్లం అశోక్, నాయకులు బొమ్మన బోయిన వెంకన్న, బన్నబోయిన రాజేష్, జర్నలిస్టులు కొమ్మనబోయిన యాకయ్య, తండా హరీష్, నగరబోయిన అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీగురు దాత్తాత్రేయ షష్టమ వార్షికోత్సవ ఆహ్వానము

సదాశివపేట, (నేటి ఫోకస్‌న్యూస్/బామిని రఘుపతి స్టేట్ కోఆర్డినేటర్)-ఫిబ్రవరి 19:

సదాశివపేట పట్టణంలోని శ్రీ మాణిక్ ప్రభు ఆలయ ప్రాంగణంలో నెలకొల్పబడిన శ్రీ గురుదత్తాత్రేయ షష్టమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సదాశివపేట పట్టణంలోని పురప్రముఖులకు, నాయకులకు, అధికారులకు, అనధికారులకు, మరియు దత్తాత్రేయ స్వామి భక్తులందరికి ఇదే మా ఆహ్వానము. తేది :21-02-2026 శనివారము రోజున ఉదయం 6. 00 గంటల నుండి కార్యక్రమాలు ప్రారంభించబడుతాయని బల్లెం భారతమ్మ లక్ష్మయ్యలు పత్రికా ముఖంగా తెలియపరిచారు. ఇట్టి కార్యక్రమము శ్రీ సద్గురు బాలమార్థాండ మహారాజ్ సర్వతోముఖయాజి పర్యవేక్షణలో నిర్వహించబడును. ఇట్టి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ వారు కోరడం జరిగింది.



# ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు

తొర్రూరు, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి/ఓరుగంటి సైదులు)-ఫిబ్రవరి 19:

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలను తూర్పాటి సాయి ముఖేష్, తూర్పాటి రాంబాబు, తూర్పాటి సతీష్ ల ఆధ్వర్యంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించి ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ మాట్లాడుతూ.. ఆయన స్థాపించిన హిందవీ స్వరాజ్యం అంటే ప్రజల పాలన, న్యాయమైన వ్యవస్థ, స్త్రీల గౌరవానికి రక్షణ, రైతులు, పేదల సంక్షేమం యుద్ధంలో శత్రువు లను ఓడించినప్పటికీ, శత్రు స్త్రీలను గౌరవిం చిన మహానాయకుడు శివాజీ మహారాజ్ అన్నారు. యువకులు ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేష్ యాదవ్, పత్తి లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, రవి, రతన్, శివ ,పవన్ ,వెంకన్న ,సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి పరీక్ష పంటల అభివృద్ధికి తొలి అడుగు

- రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరామిరెడ్డి

**కల్వకుర్తి, నేటి ఫోకస్ న్యూస్ ఫిబ్రవరి 19:**



వ్యవసాయ రంగంలో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచడం ద్వారా అధిక దిగుబడులు సాధించడంతో పాటు రైతులకు మెరుగైన లాభాలు అందుతాయని,ఈ లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరామిరెడ్డి అన్నారు. గురువారం రైతు కమిషన్ బృందం నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని వంగూర్ మండలంలోని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి గ్రామంలో రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరామిరెడ్డి నేతృత్వంలో కలెక్టర్ బాదావత్ సంతోష్, అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని గ్రామంలోని రైతు వేదిక వద్ద రైతులకు భూసార పరీక్షల ప్రాముఖ్యత, నేల నాణ్యత ఆధారంగా ఎరువుల వినియోగ విధానం, సేంద్రియ వ్యవసాయం ప్రయోజనాలపై వివరణాత్మకంగా అవగాహన కల్పించారు. అనంతరం మినీ కిట్ల పంపిణీ, భూసార పరీక్షలకు సంబంధించిన పరికరాలను రైతులకు పంపిణీ చేశారు.రైతుల నిర్దేశించి రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరామిరెడ్డి మాట్లాడుతూ.. పంటల అభివృద్ధి మరియు అధిక దిగుబడుల సాధనలో మట్టి పరీక్ష అత్యంత కీలకమని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరామిరెడ్డి పేర్కొన్నారు. రైతులు పంటలు విత్తే ముందు తప్పనిసరిగా తమ భూముల మట్టి పరీక్ష చేయించుకోవాలని ఆయన సూచించారు.మట్టి పరీక్ష ద్వారా భూమిలో ఉన్న పోషక పదార్థాల స్థాయి, పిహెచ్ విలువ, సేంద్రియ పదార్థాల శాతం వంటి కీలక వివరాలు తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ సమాచారం ఆధారంగా సరైన ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ మరియు తగిన పంటల ఎంపిక చేయడం సులభమవుతుందని అవసరానికి మించి ఎరువులు వేయడం వల్ల రైతులకు ఆర్థిక నష్టం కలగడంతో పాటు భూమి సారంపై కూడా ప్రతికూల ప్రభావం ఉంటుందని ఆయన హెచ్చరించారు. మట్టి పరీక్ష ద్వారా అవసరమైన ఎరువులనే వినియోగించడం సాధ్యమవుతుందని, దీనివల్ల ఖర్చులు తగ్గి దిగుబడి పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో రైతుల ఆదాయాన్ని పెంచేందుకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం అవసరమని, అందులో మట్టి పరీక్ష కీలక పాత్ర పోషిస్తుందని, రైతులు ప్రభుత్వ వ్యవసాయ విభాగం ద్వారా అందుబాటులో ఉన్న మట్టి పరీక్ష సేవలను వినియోగించుకోవాలని, రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ ఖర్చులను తగ్గించి, స్థిరమైన వ్యవసాయ విధానాలను అనుసరించాలని చైర్మన్ కోదండరామిరెడ్డి పిలుపునిచ్చారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ,. దేశ వ్యవసాయ రంగ అభివృద్ధిలో తొలి భారత ప్రధాని జవహర్లాల్ నెహ్రూ కీలక పాత్ర పోషించారని, దూరదృష్టితోనే హరిత విప్లవానికి బలమైన పునాదులు పడినట్లు తెలిపారు. నేడు దేశంలో రెండు సంవత్సరాలకు సరిపడే ఆహార ధాన్యాల నిల్వలు ఉండటం ఆయన చేపట్టిన విధానాల ఫలితమేనని అన్నారు. ఆధునిక వ్యవసాయ సాంకేతికతను ప్రోత్సహించడం, భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం వంటి అంశాలకు ఆయన ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. ముఖ్యంగా శ్రీశైలం డ్యాం, నాగార్జునసాగర్ ప్రాజెక్టు వంటి ప్రాజెక్టుల నిర్మాణం వ్యవసాయ రంగానికి బలాన్ని ఇచ్చాయని వివరించారు. అదేవిధంగా వ్యవసాయ పరిశోధనా సంస్థల స్థాపన ద్వారా రైతులకు శాస్త్రీయ పద్ధతులను అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. ఇదే తరహాలో నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బీమా వంటి పథకాలతో పాటు, గత పది సంవత్సరాలుగా రైతులకు అందని వ్యవసాయ పనిముట్లను మళ్లీ అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారని, రైతులకు అవసరమైన యూరియా ఎరువుల పంపిణీ సమర్థవంతంగా చేపడుతూ రైతులకు వ్యవసాయం లవసాటిగా జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. నల్లమల్ల ప్రాంతమైన అచ్చంపేట నియోజకవర్గ ప్రాంతంలో ముఖ్యమంత్రి స్వగ్రామంలో రైతు కమిషన్ ఆధ్వర్యంలో చేపట్టిన భూసార పరీక్ష కార్యక్రమాలను చేపట్టడం ఆయన ప్రత్యేకంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ.. రసాయన ఎరువులను అధికంగా వాడడం వల్ల, కేవలం పంట దిగుబడి తగ్గిపోతుందని మాత్రమే కాదు, పెట్టుబడులు ఎక్కువగా ఖర్చవుతాయని, అలాగే మానవ ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదం కలగవచ్చని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. పంటలకు సరిపడే వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాల మేరకు ఎరువులను పంటలకు వినియోగించుకోవాలని, రైతులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమ కమిషన్ ఆధ్వర్యంలో చేపట్టిన భూసార పరీక్షలతో వ్యవసాయ రంగంలో మార్పులు వస్తాయని, రైతులకు లాభంతో పాటు నేల సాంద్రతను పెంచుకొని ఆరోగ్యకరమైన పంటల సాగు జరుగుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఉమ్మడి జిల్లాలో కేవలం జడ్చర్ల పట్టణంలో మాత్రమే భూసార పరీక్షలు నిర్వహించే కేంద్రం ఉందని, భూసార పరీక్షలకు సమయం పడుతుందని ప్రభుత్వం గ్రహించి రైతుల వద్దకే పరీక్షలు నిర్వహించేలా నేడు రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమ కమిషన్ రైతు కేంద్రాల వద్దకి భూసార పరీక్షలను తీసుకొచ్చిందని కలెక్టర్ తెలిపారు.

రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు కేవీ నర్సింహారెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్, మరికంటి భవానీ రెడ్డి, భూమి సునీల్ ,రాంగోపాల్ రెడ్డి, రాములు నాయక్, గంగాధర్ మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను ఎరువుల వినియోగం భూసార పరీక్షలు పంటల దిగుబడి తదితర అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లేపల్లి వెంకటేష్, రైతు సంక్షేమ కమిషన్ మెంబర్ సెక్రటరీ గోపాల్, వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు సుచిత్ర, రాష్ట్ర వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ సంధ్యారాణి, వ్యవసాయ ప్రధాన సైంటిస్ట్ డాక్టర్ బ్రజేంద్ర, డాక్టర్ రాంప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, వ్యవసాయ అధికారులు రేవతి, చంద్రశేఖర్, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# పెళ్లి సందడి ప్రారంభం



నేటి నుండి మోగనున్న పెళ్లి బాజాలు
కళకళలాడనున్న పెండ్లి మంటపాలు
ఫంక్షన్ హాళ్లు, క్యాటరింగ్ సర్వీసులకు ఫుల్ డిమాండ్

కల్వకుర్తి, నేటి ఫోకస్ న్యూస్ ఫిబ్రవరి 19:

మూడు నెలల విరామం తర్వాత మూఢాలు పోయి, వివాహ ముహూర్తాలకు మంచి రోజులు వచ్చాయి. మాఘమాసంలో ఎక్కువగా ఉండే పెళ్లిళ్లకు ఈ ఏడాదిలో మూఢాలు రావటంతో చాలావరకు పెళ్లిళ్లు ఆలస్యంగా జరగనున్నాయి. నేటి నుండి ప్రారంభం కానున్న పెళ్లి ముహూర్తాలు, మే నెలలో సగం వరకు ఉన్నాయి. దీనితో మూడు నెలలుగా వచ్చిన విరామంతో ఆలస్యంగా జరిగే పెళ్లిళ్లు ఈ మంచి ముహూర్తాలలో జంటలు ఒక్కటి కానున్నాయి. ఈ పెళ్లి ముహూర్తాలలో జంటలు ఒక్కటవ్వమే కాకుండా, ప్రత్యక్షంగా, పరోక్షంగా చాలా మందికి ఉపాధి సైతం దొరకనుంది. బట్టల దుకాణాలు, ఫంక్షన్ హాళ్లు, క్యాటరింగ్ సర్వీసులు, ఫోటోగ్రాఫర్లు, డెకరేషన్, మంగళవాయిద్యాలు, ఆర్కెస్ట్రా, భారీ సెట్టింగులు చేసే వారందరితో పాటుగా వారి కింద పనిచేయడానికి వచ్చే చాలామంది రోజువారీ కూలీలకు ఈ ముహూర్తాలలో నిత్యం పని దొరకనుంది.

**షాపింగ్ హడావిడి**

మంచి ముహూర్తాలు ప్రారంభం కావటంతో ఎంగేజ్‌మెంట్, వివాహాలకు సంబంధించిన షాపింగ్ హడావిడి ఆయా బట్టల దుకాణాలలో కనిపించనుంది. దీనికి తోడు షాపింగ్ సైతం ఊపందుకుంది. ఇప్పటికే పెళ్లిళ్ల కొరకు బంగారం, ఇతర ఆభరణాల కొరకు షాపింగ్‌లు కుటుంబసభ్యులు ప్రారంభించారు. అదేవిధంగా బంగారం ధరలు రోజురోజుకు ఆకాశాన్ని తాకుతున్న, వివాహంలో అది తప్పనిసరిగా కొంతైనా పెట్టాలన్న ఉద్దేశంతో వాటిని కొనుగోలు చేస్తున్నారు. పెళ్లిలో భోజనాలు, క్యాటరింగ్, ఫంక్షన్ హాళ్లు, డెకరేషన్లు, భారీభారీ సెట్టింగుల కొరకు ముందస్తు బుకింగ్‌లు చేసుకుంటున్నారు. పెండ్లి కార్డులు, వంటలు చేసేవారు, ఫ్లెక్సీలు, ఫోటోగ్రాఫర్లు, టెంట్‌హౌస్, బ్యూటీషియన్లు, మెహందీ వేసేవారు, సంగీత్‌లు చేసేవారు ఆర్టిస్టులు, మంగళవాయిద్యాలు ఇలా చాలా వరకు పనివారిని ముందుగానే బుక్ చేసుకుంటున్నారు. పెళ్లి వేడుకలకు ముడిపడి ఉన్న ప్రతిఒక్కరికి పని మొదలైంది. ఆర్థికంగా ఉన్నవారు వారి స్థోమతకు తగినట్లుగా వెడ్డింగ్ ప్లానర్లు, సాధారణ, మధ్య తరగతి వారు వారి స్థాయికి తగ్గట్టుగా పెళ్లి వేడుకలకు సిద్ధమవుతున్నారు.

**భారీ సెట్టింగులకు డిమాండ్**

పెళ్లిలలో ఆర్థికంగా బలంగా ఉన్న భారీ సెట్టింగ్‌లను ఏర్పాటు చేసేందుకు, కళ్లు చెదిరిపోయే సెట్టింగ్‌లు ఏర్పాటు చేసేలా వెడ్డింగ్ ప్లానర్లతో మాట్లాడి కొత్తదనంగా ఉండేలా ఆలోచనలు చేస్తున్నారు. రూ.లక్షలలో ఫంక్షన్ హాలు అద్దెలు ఉన్నా, సెటింగ్‌లకు అదే రీతిలో రూ.లక్షలు ఖర్చయినా గొప్పగా ఉండాలని భావిస్తున్నారు. పెండ్లిలో రూ.లక్షలు ఖర్చయినా సరే కానీ, ఆ సమయంలో వచ్చే ఆ ఆనందం కొరకు ఖర్చులు భారీగానే వధూవరుల తల్లిదండ్రులు చేస్తున్నారు. ప్రాంతాలకు తగినట్లుగా మండపాలను తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

**ఫోటోగ్రఫీలో కొత్త టెక్నాలజీ**

ప్రస్తుతం పెండ్లిలలో ఫోటోగ్రఫీ కొరకు రూ.లక్షలలో ఖర్చు చేస్తున్నారు. అందుకు తగ్గటుగా ఫోటోగ్రఫీలో పెండ్లికి ముందే ప్రీ వెడ్డింగ్ షూట్, పోస్ట్ వెడ్డింగ్ షూట్లను వధూవరులు చేస్తున్నారు. అక్కడ షూట్ చేసిన వాటికి నూతన పాటలను వీడియోలకు జోడించి, పెండ్లి మంటపాలలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి వాటిని అందులో ప్లే చేయటం నయా ట్రెండ్‌గా మారింది. వీటికి తోడు సాధారణ, మధ్య తరగతి వారు సైతం హాల్దీ పేరుతో ప్రత్యేకంగా కార్యక్రమాలు చేస్తున్నారు.

**వాయిద్యాలకు మంచి గిరాకీ**

హిందూ సాంప్రదాయంలో మంగళవాయిద్యాలు లేకుండా పెళ్లి బేడుక ఉండదు. పెళ్లి కార్యక్రమాలు ప్రారంభం నుండి పెండ్లి పూర్తయి, అప్పగింతలు పూర్తయ్యే వరకు భాజాలు ఉండక తప్పదు. వీటికి తోడు పెండ్లిలో ఆర్కెస్ట్రాను చాలావరకు తప్పనిసరిగా చాలామంది వాడుతున్నారు. పెండ్లిలో భోజనాలకు ఎంతైనా ఖర్చు చేసేందుకు వెనకాడటం లేదు. వారు ఎంచుకున్న మెనూ ప్రకారం ప్లేటుకు ఇంత అని, డిమాండ్‌ను బట్టి వాటి రేట్లలో హెచ్చుతగ్గులు ఉంటాయి. అధేవిధంగా పెళ్లిళ్లు చేయించే పురోహితులకు సైతం మంచి డిమాండ్ ఉంటుంది.

**మంచి ముహూర్తాలు ఇవే**

**ఫిబ్రవరి నెలలో: 20,25,26,27**
**మార్చి నెలలో: 5,6,8,12,14,15,28,29**
**ఏప్రిల్ నెలలో: 1,3,4,8,11,12,26,29**
**మే నెలలో: 1,3,6,8,9,13**

## ముహూర్తాలు ప్రారంభం అయ్యాయి: సాయికిశోర్, పురోహితులు, కల్వకుర్తి

గత మూడు నెలలుగా మూఢాలు రావటంతో ముహూర్తాలు లేకుండా ఉన్నాయి. నేటి నుండి ప్రారంభమయ్యే ముహూర్తాలు మే నెల మధ్యమం వరకు కొనసాగనున్నాయి. ఈ నాలుగు నెలల కాలంలో మంచి ముహూర్తాలు ఉన్నందున పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలు చేసుకోవచ్చు.